మినీ కథ

# ధర్మరాజు చెల్లెలు

మురారి సుబ్బారావు



ధర్మరాజుని కలుసుకుందామని బయల్దేరాను.

ధర్మరాజు నా ప్రాణస్నేహితుడు.

ధర్మరాజు భార్య పావని నన్ను అన్నయ్యా అని పిలుస్తుంది. ఆ వరసన నాకు పెళ్ళయ్యాక నా భార్య ధర్మరాజుకు చెల్లెలవ్వాలి. అది రూలంటాడు ధర్మరాజు.

నిన్న సాయంత్రం నేనూ మా అమ్మా, నాన్నా పెళ్ళిచూపులు చూడ్డానికి వెళ్ళాం. అమ్మాయి బాగుంది. నాకు నచ్చింది కూడా.

ఆ విషయం వాళ్ళింట్లోనే చెప్పాను. అదిగో- ఆ మాటకి పట్టుపట్టేరు అమ్మా నాన్నా.

ఆ పట్టుదల నాకు సమస్య అయింది. ధర్మరాజును కలిసేదందుకే.

* * *

పెళ్ళికూతుర్ని తీసుకొచ్చి నా ఎదురుగా కూర్చోబెట్టారు.

అంతకుముందు ఫోటోలో చూసిన దాని కన్నా మరింత అందంగా వుంది లావణ్య.

మా చూపులు కలుసుకుని నవ్వుకున్నాయి. ఈ పెళ్ళిచూపులకు రాక పూర్వమే నా ఫ్రెండ్స్ ద్వారా- ముఖ్యంగా ధర్మరాజు భార్య, నాకు చెల్లెలు అయిన పావని ద్వారా లావణ్య గురించీ, మనస్తత్వం గురించీ సర్దుకుపోయే గుణం గురించీ, ఆలోచనా సరళి గురించీ పూర్తిగా తెలుసుకున్నాను. అవన్నీ నాకు నచ్చేయి- యిప్పుడు రూపంలో కూడా.

పసిమి ఛాయతో తుమ్మెదల కళ్ళని అల్లల్లాడిస్తూ నావంక ఓరగా చూసింది లావణ్య. ఇసుకతిన్నె మీద ఎర్ర కలువ ముడుచుక్కూర్చున్నట్లు ఆమె నుదుట బొట్టు నా కోపమే ధరించినట్లుగా వుంది. క్షణం

అందుకే చెప్పేశాను —

"నాకు అమ్మాయి నచ్చిందమ్మా"

మా వాళ్ళు నన్నడగలేదు. ఇంటికి వెళ్ళి రాస్తామని వాళ్ళతో అనలేదు. నాకుగా నేనే అనేశాను మాట. అందుకు కారణం లావణ్యని భార్యగా మనస్ఫూర్తిగా కోరుకోవడమే.

అమ్మ ఆనందంగా చూసింది నా వంక. నాన్న వింతగా చూస్తున్నారు నా వంక. కళ్ళతోటే కోపంగా చూసారు నన్ను నమిలి మింగేసేలా. ఆయనకు యస్వీ రంగారావంటే యిష్టం. "ఛీ! అసందర్భ ప్రలాపీ" అని ఏదో సినిమాలో యస్వీరంగారావుగారన్న డైలాగు ఈయన మనసులోనే అనుకొని నా వైపు కోపంగా చూసుంటారు. ఆ ఊహకు నవ్వొస్తుంటే లావణ్య వైపు చూశాను. లావణ్య సున్నితంగా నవ్వుతూ చూస్తోంది నన్నే.

"సరే. మిగతా విషయాలు మేం మాట్లాడుకొని వస్తాం" అన్నారు నాన్న నాతో. ఆ మాటల అర్థం నా ఎదురుగా కట్న కానుకల విషయం మాట్లాడకూడదనే ఉద్దేశం కావచ్చు. పెళ్ళి రోజెప్పుడో. ముహూర్తాలు ఎన్నాళ్ళకున్నాయో అనుకుంటూ మరోసారి లావణ్య రూపాన్ని క్లిక్ మనిపించి బయటకు వచ్చేశాను.

తర్వాత అమ్మా, నాన్నా ఇంటికొచ్చేరు. "వాళ్ళు మనం అడిగినంత కట్నం ఇవ్వలేరట. లాంఛనాలు కూడా ఏదో ఉన్నంతలో జరిపిస్తారట. మనింట్లో వీడే ఆఖరు పెళ్ళి. కాస్త ఆర్భాటంగా పుచ్చుకోపోతే ఎలా? అందుకనే మనం అడిగినంత కట్నం ఇవ్వలేకపోతే మాతో సంబంధం వీగిపోయినట్లేనని చెప్పి వచ్చేశాం" అన్నారు నాన్న.

నాకు బాధ కలిగింది. పెద్దన్నయ్యకు మంచి కట్నం తెచ్చింది పెద్దొదిన. ఇక రెండో అన్నయ్యకు వాళ్ళు అడక్కుండానే పెద్ద కట్నం, లాంఛనాలు వచ్చేయి. అన్నయ్యలిద్దరికన్నా ఎక్కువ చదువుకోవడం చేత, మంచి ఉద్యోగం కావడం వల్లా నా దగ్గరికొచ్చేసరికి నాకు ఇంత అని కట్నం నిర్ణయించేశారు. మావాళ్ళు అడిగినంతా ఇవ్వకపోవడం వల్ల లావణ్యను వదులుకోవడం నాకిష్టం లేదు. అదే ఇప్పటి నా సమస్య.

నేను వెళ్ళేసరికి గుమ్మంలోనే ఎదురయ్యాడు ధర్మరాజు. సంగతి చెప్పాను మా పెళ్ళి జరగడానికి ఏదో ఉపాయం ఆలోచిస్తానని మాట ఇచ్చాడు ధర్మరాజు. ఇంటికి వచ్చేశాను.

తర్వాత రెండు రోజులకు లావణ్య

తండ్రి వచ్చి ఊహించని వార్త చెప్పారు. లావణ్యకు నేను నచ్చలేదట. కాస్త మెడ పక్కకు పెట్టి నడుస్తానని. కాస్తంత పొట్ట వుందని. ఇంకా ఏవో వంకలు పెట్టిందిట. ఆ టైముకి ధర్మరాజు మా యింట్లోనే వున్నాడు. నేనేమీ మాట్లాడలేకపోయాను లావణ్య మాటలు తలుచుకొని.

"అడిగినంత కట్నం ఇవ్వలేరుకాని ఇలా వంకలు పెడతారా? పైగా ఆడపిల్ల! ఎంత ఇన్సల్ట్....మనకి.... ఈ మాటలు మా అబ్బాయినన్నా పరోక్షంగా మిమ్మల్ని అన్నట్టే. మీ అబ్బాయికి నడకతీరు నేర్పలేదని. మీ వంశం ఎలాంటిదో తెలుసునన్నట్లు మీ ఆత్మాభిమానంమీద దెబ్బ కొట్టింది. అందుకే లావణ్యనే కోడలిగా తెచ్చుకోండి. కాపురానికొచ్చాక తిక్క కుదర్చవచ్చు" అన్నాడు మా ధర్మరాజు కోపంగా.

"వాణ్ణి అంత మాటంటుందా. అడిగినంత ఇవ్వకపోతే పోయె. ఆ పిల్లనే చేసుకుందాం. తర్వాత రోగం కుదుర్తుంది" అంది అమ్మ.

నాకూ పౌరుషం వచ్చింది అలాఅన్నందుకు. లావణ్యనే పెళ్ళాడి ఇక పుట్టింటికి పంపకూడదని నిర్ణయించుకున్నాను.




తర్వాత నెల రోజులకు లావణ్యకు, నాకు పెళ్ళయింది వాళ్ళివ్వగలిగినంతకట్న కానుకలతోనే.

"నేను నచ్చలేదన్నావుట" అన్నాను శోభనం గదిలో ఎడమొహం పెట్టి లావణ్యతో. కిసుక్కున నవ్వింది. తర్వాత దగ్గరికొచ్చి అంది:


"మీరు నన్ను కోరుకున్నట్లే— నేనూ మిమ్మల్ని కోరుకున్నాను. మా ధర్మరాజన్నయ్యగారు నెల క్రితం మా యింటి కొచ్చేరు. మహాభారతంలో ధర్మరాజు అంతటివాడు 'అశ్వద్ధామ హతః' అన్నాడు అవసరానికని. ప్రత్యర్థి పరాక్రమాన్ని శౌర్యాన్ని నీరు కార్చాడు. అలాగే ఏ వంకా లేని మిమ్మల్ని నచ్చలేదని చిన్న అబద్ధం ఆడితే మీ వాళ్ళకు పౌరుషంవస్తుంది. కోపం వస్తుంది. అక్కడ నేను మేనేజ్ చేస్తాను. మీ పెళ్ళి జరుగుతుంది అని చెప్పేరు. అంతే అబద్ధమాడేశాను. మీ వాళ్ళకు కోపం వచ్చింది. మనకి పెళ్ళయింది. ఒక్కోసారి ఆగ్రహం కలిగినా మంచే జరుగుతుంది" అన్నది లావణ్య.

ఆ మాటలకు నేను ఆశ్చర్యం నుంచి తేరుకునేలోగా మరింత దగ్గరగా చేరింది లావణ్య.

విద్యుచ్ఛక్తి సరఫరాకు తగిన సాధనము

ఏవన్‌ప్లాస్ట్®

రిజిడ్ పి.వి.సి.
కాండ్యూట్ పైపులు.
16 మి.మి నుండి
63 మి.మి. వరకు లభిస్తాయి.



MAP/AI/4484 TEL

IS : 2509

ఏ వన్ ఇండస్ట్రీస్

27/1 యూనిటి బిల్డింగ్స్ బెంగళూరు 560002 ఫోన్: 225283/224801